క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమర్తలూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు తెలిపారు. తెనాలి 132 కేవీఎస్ఎస్ సబ్ స్టేషన్, అమర్తలూరు 33/11 కేవీ సబ్ స్టేషన్, మూల్పూరు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య



నగరం: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి మండలంలోని సజ్జావారిపాలెంలో జరిగింది. ఎస్ఐ బండ్ల భార్గవ్ సమాచారం మేరకు చినగంజాంకు చెందిన కుక్కల నరసింహారెడ్డి (21) పోస్టల్ జాబ్‌కు ప్రిపరేషన్ నిమిత్తం సజ్జావారిపాలెంలోని తన స్నేహితులైన పవన్, రామకృష్ణతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. పక్క ఇంటి వారి చెట్టు కొమ్మ విషయంలో స్నేహితుల మధ్య గొడవ జరిగి అరుచుకున్నారు. ఈ క్రమంలో నరసింహారెడ్డి మనస్థాపం చెంది క్షణికావేశంలో స్నేహితులు ఇద్దరు ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుని తండ్రి ఏడుకొండలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం నరసింహారెడ్డి మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

బాలకోటేశ్వరస్వామికి మాస శివరాత్రి పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గ్రామం గోవాడ శివ క్షేత్రమైన ప్రసిద్ధి గాంచిన బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మాస శివరాత్రి పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శివ పురాణం ప్రకారం మాస శివరాత్రి రోజున భక్తితో పూజలు, ఉపవాసం చేస్తే కష్టాలు తొలగి సంతోషం కలుగుతుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు చావలి శ్రీధర శర్మ, పొన్నపల్లి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

మద్యం షాపు నిర్వాహకులతో సమావేశం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవికుమార్



వేమూరు: మద్యం షాపులో వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం షాపుల నిర్వాహకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరు బాటిల్స్ తప్పనిసరిగా కాల పరిమితి దాటినవి అమ్మకూడదని ఆయన హెచ్చరించారు. కాల పరిమితి దాటిన బాటిల్ అమ్మితే 14405 లేదా 8500617998 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

దుగ్గిరాల: రైతులందరూ తప్పని సరిగా పంట బీమా నమోదు చేయించుకోవాలని.. దానిద్వారా పంట నష్టపరిహారం లభిస్తుందని ఏవో ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం చింతలపూడి గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. బీమా నమోదు చేయించుకుంటే పంట నష్టాల నుంచి రైతులు తేరుకోవచ్చునని ఆయన తెలిపారు.

పుట్టింటికని బయల్దేరి అదృశ్యమైంది

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలవరం గ్రామానికి చెందిన వివాహిత దుర్గ మచిలీపట్నంలోని తన పుట్టింటికి వస్తున్నట్టు తెనాలి బస్టాండ్ నుంచి కుటుంబ సభ్యులకు మంగళవారం ఫోన్ చేసింది. అక్కడికి చేరుకోకపోవడంతో వారు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాములు నాయక్ తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!?

- రోడ్లపై అడ్డదిడ్డంగా ఆవులు
- ప్రమాదాలకు గురవతున్న వాహనదారులు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



బాపట్ల పట్టణంలో ప్రధాన కూడలిలో ఆవుల సంచారం

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించాక రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. స్థానిక రథం బజారు, జీబీసీ రోడ్లు విస్తరణ చేశారు. ఇది ప్రజలకు ఎంతగానో మేలు చేకూర్చింది. అయితే బాపట్ల పట్టణంలో పారిశుద్ధ్య చర్యల్లో ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన మునిసిపాలిటీ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆవులు తిష్ట వేసుకుని కూర్చుంటున్నాయి. వీటి గురించి పట్టించుకునే నాథుడు మాత్రం లేరు. ఆవుల కారణంగా వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇదే సమయంలో దుకాణాల యజమానులు సైతం ఆవుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పక్కకు తోలుతున్నా వెళ్లడం లేదని, దీంతో తమ వ్యాపారాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలే ఆహారం

గోవులు, వీధుల్లో చెత్తకుప్పల వద్దనే ఆహారాన్ని వెతుక్కుంటున్నాయి. ప్రజలు వినియోగించి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తినటంతో గోవుల జీర్ణప్రక్రియ కూడా దెబ్బతిని ఒక్కొక్కసారి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. గతంలో పలుచోట్ల అతికించే సినిమా వాల్‌పోస్టర్లు తింటూ కడుపునింపుకునేవి. ప్రస్తుతం ఎక్కడా వాల్‌పోస్టర్లు కనిపించకపోవటంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తిని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నాయి.

చర్యలు తీసుకోవాలి

ఆవులను వాటి యజమానులు ఇష్టానుసారం రోడ్లపై వదిలి వేస్తున్నారు. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి గాయాల గురవుతున్నారు. అయినప్పటికీ గోవుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్ని సందర్భాల్లో గోవులు గాయపడుతున్నప్పటికీ వాటిని చికిత్స చేయించేందుకు యజమానులు ముందుకు రాకపోవటం విమర్శలకు తావిస్తోంది. గోవులను పాల అవసరాలకు వాడుకుని నిర్లక్ష్యంగా వదిలివేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గడిచిన రెండు నెలల్లో బాపట్ల పట్టణంలో 60 శాతం వరకు రోడ్డు ప్రమాదాలు ఆవుల కారణంగానే జరిగాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఆవులను బందెల దొడ్డికి తరలించాలని, ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

నగరంలో గోవుల కారణంగా ప్రజలకు రక్షణ కరువైంది. గోవులు రహదారులపై ఉండటం వలన రాకపోకల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రోడ్లపై ఉన్న గోవులను వాహనాలు ఢీకొని గాయాలవుతున్నాయి. కొన్ని గోవులకు పట్టణంలోని గో సంరక్షణ కేంద్రంలో ఆశ్రయం కలిగిస్తున్నప్పటికి అన్నింటిని ఆదరించే పరిస్థితి సమితికి లేని కారణంగా గోవుల సంరక్షణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– డాక్టర్ పి.సి.సాయిబాబు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి

పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి సారవంతం

బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉష



అద్దంకివారిపాలెంలో పచ్చిరొట్ట పైర్లు పరిశీలిస్తున్న డాక్టర్ ఉష, ఏడీఏ లక్ష్మి

నగరం: పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందని బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉష చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అద్దంకివారిపాలెంలో నిర్వహించిన క్షేత్ర సందర్శనలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకే రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఎంత మోతాదులో వాడాలో వివరించారు. రేపల్లె ఏడీఏ ఏ లక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసే రైతులు పీఎంఎఫ్‌బీవై ద్వారా పంట బీమా కింద ఎకరానికి రూ.80 ప్రీమియంను ఆగస్టు 15లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కే నాగశ్రీనివాస్, వంశీకృష్ణ, వీఏఏ వై.దివ్య పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

కర్లపాలెం: ఈ ఖరీఫ్ సాగులో సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ చెప్పారు. బుధవారం మండల పరిధిలోని బోలాయపాలెం, చింతాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణం వివరాలను వ్యవసాయాధికారులకు తెలిపి నమోదు చేయించుకోవాలని చెప్పారు. కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు ఉంటేనే సబ్సిడీ పథకాలు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులందరూ తప్పనిసరిగా రెవెన్యూ అధికారులను సంప్రదించి సాగు హక్కు పత్రాలు పొందాలని చెప్పారు. రైతులందరూ ఆగస్టు 15వ తేదీ లోపు పంట బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో సరళ, వ్యవసాయ సహాయకులు స్వాతి, భార్గవి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలి

వేమూరు: రైతులందరు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రేమ్‌సాగర్ తెలిపారు. వేమూరు మండలంలోని వెల్లబాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు చేసుకోవటానికి బుధవారం చివరి రోజుని గుర్తు చేశారు. కౌలు రైతులందరు కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంట బీమా ప్రీమియం చెల్లించాలి

భట్టిప్రోలు(వేమూరు): రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు, సూరేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరానికి రూ.800 ప్రీమియం చెల్లించడం ద్వారా రూ.40,000 వరకు బీమా పొందవచ్చన్నారు. వెద పెట్టిన వరి పంటలను పరిశీలించారు. వెద పద్ధతిలో వరి నాటిన రైతులకు తగు సూచనలు అందించారు. నారుమడిలో పోషక లోపాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు కె.లక్ష్మీ, ప్రసన్న, వి.బుష, అఖిల, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపిరాజు, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వెల్లబాడు గ్రామంలో మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్



ఇంటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో హేమంత్

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

అమర్తలూరు(వేమూరు): ఖరీఫ్ పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు, తురుమెళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకం గురించి వివరించారు. వరి పంటకు ఎకరాకు రూ.800 చెల్లించుకోవాలన్నారు. క్రాప్ రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంక్ ద్వారా ప్రీమియం చెల్లింపు జరుగుతుందని, రుణాలు తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటరు, మీ సేవ కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జేఎంజే మహిళా కళాశాలలో ఎన్నికల సందడి



కళాశాలలో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియ



బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న విద్యార్థినులు

తెనాలిటౌన్: విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ఉన్నంతంగా రాణించాలని జేఎంజే మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ శాంత పేర్కొన్నారు. బుధవారం స్థానిక జేఎంజే మహిళా కళాశాలలో పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికల తరహాలో కాలేజ్ లీడర్స్, క్లాస్ లీడర్స్, వివిధ కమిటీల్లో సభ్యులు ఉండేందుకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 50 మంది పైగా విద్యార్థినులు పోటీ చేశారు. వీరికి యాజమాన్యం ఎన్నికల గుర్తును తయారు చేసి ఇవ్వగా ప్రతి విద్యార్థినీ మాకు ఓటు వేయండి అని ఎన్నికల మాదిరిగా అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. విద్యార్థులందరూ ఎన్నికల సందడితో అమూల్యమైన ఓటు వినియోగించుకున్నారు. రాబోయే రోజుల్లో లీడర్లు ఎదగడానికి ఈ ఎన్నిక ప్రక్రియ దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ శాంత అభిప్రాయపడ్డారు. ఎన్నికల సిబ్బందిగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వ్యవహరించారు. ఎన్నికల ఫలితాలను గురువారం తెలియజేస్తామని ప్రిన్సిపల్ తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ రోజ్‌లీనా, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలి



పెదకాకాని(ఏఎన్‌యూ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు హేమంత్‌రామ్ మాట్లాడుతూ.. ఒరిస్సాలో 19 ఏళ్ల యువతిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలని కోరారు. ఎన్ఎస్‌యూని దేశమంతటా బ్యాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ పేరుతో విద్యార్థులపై దాడులు చేయాలని నేర్పిస్తుందా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతంలో బైక్ చక్రాలు తొలగింపు



రైల్వేహాల్ట్ సమీపంలో ముళ్లపొదల్లో చక్రాలు లేని బైక్

పెదకాకాని: చాకచక్యంగా బైక్‌లు కాజేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురి బైక్‌లు మాయం అవుతున్నప్పటికీ కొన్ని మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. పెదకాకాని రైల్వే హాల్ట్ సమీపంలో ఉన్న నిర్మానుష ప్రాంతంలో కొత్త ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. ఆ బైక్‌కు రెండు చక్రాలు, బ్యాటరీ, పలు స్పేర్‌స్పార్ట్‌లు తొలగించి ఉన్నాయి. ఈ బైక్‌ను అనకాపల్లి ప్రాంతం నుంచి దొంగిలించి పెదకాకాని ఏరియాకు తీసుకు వచ్చి ముళ్ల పొదల్లో వదిలేశారని.. బైక్‌లోని విలువైన సామాన్లను తొలగించి తీసుకు వెళ్లి ఉంటారని సమాచారం. అలానే నెల రోజుల క్రితం పెదకాకాని రైల్వేహాల్ట్ వద్ద పెట్టి వెళ్లిన బైక్ ఇప్పటికీ అలానే ఉంది. నాలుగు నెలల కిందట వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల మధ్య నిర్మానుష ప్రదేశంలో మరో బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు.

షార్ట్ సర్క్యూట్‌తో గొడ్ల చావిడిలో అగ్ని ప్రమాదం

రేపల్లె: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా మరో రెండు మూగజీవాలు తీవ్రగాయాలపాలైన ఘటన బుధవారం మండలంలోని పేటేరులో చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు పేటేరు గ్రామానికి చెందిన వాకా సాంబశివరావుకు చెందిన గొడ్ల చావిడిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో మంటలు వ్యాప్తి చెంది గొడ్ల చావిడికి మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. ప్రమాదంలో ఏడు నెలల చూడిగేదె మృతి చెందగా ఒక పాడి గేదె, రెండు సంవత్సరాల దూడ తీవ్రంగా గాయాలపాలయ్యాయన్నారు. రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

గ్రామ దేవతలకు ఆషాఢ సారె సమర్పణ





వెల్లటూరు(భట్టిప్రోలు): గ్రామ దేవతలను పూజించటం వల్ల పాడి పంటలు, సకల శుభాలు కలుగుతాయని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అన్నారు. బుధవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గౌడపాలెం వాకా వారి ఇలవేల్పు యల్లారమ్మ తల్లికి మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగింపు, నగర సంకీర్తన నిర్వహించి సారె సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వాకా వెంకటన్నారాయణ, భద్రయ్య, అంకమ్మరావు, ఆరేపల్లి సుధాకర్, వాకా వెంకటేష్, బాలయ్య, రాజేష్, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు క్రాప రవికుమార్, జంజనం హేమ శంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. వెల్లటూరు గ్రామ దేవతలైన అమ్మవార్లకు గౌడ సంఘీయులు ఆషాఢ సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

గోగులమ్మ అమ్మవారికి ఆషాఢ సారె

పెదపులివర్రు(భట్టిప్రోలు): వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారికి బుధవారం ఆషాఢ మాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాతః కాలంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తుల మనోభీష్టాలను నెరవేర్చే గ్రామ దేవతను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

విద్యుత్‌పై మాట తప్పిన కూటమి ప్రభుత్వం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

బాపట్ల: విద్యుత్‌పై రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి' అనే కరపత్రాలను ఆవిష్కరించారు. డి.రమాదేవి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి కూటమి ప్రభుత్వం ప్రజలకు నమ్మక ద్రోహం చేసిందని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో విద్యుత్ ఛార్జీలు పెంచబోము తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, వైఎస్సార్‌సీపీ పాలనలో బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను లోకేష్ పగులగొట్టిన దాఖలాలను ఆమె గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలపై ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి, జిల్లా పార్టీ కార్యదర్శి సీహెచ్ గంగయ్య, టి.కృష్ణమోహన్, ఎన్.బాబురావు, సీహెచ్ మణిలాల్ మజుందార్ పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం నేటి యువతకు ఆదర్శం



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ఆచార్య డీవీఆర్ మూర్తి

బాపట్ల: పౌరుషానికి ప్రతీక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం అని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య డీవీఆర్ మూర్తి అన్నారు. బుధవారం ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంయుక్తంగా నిర్వహించిన టంగుటూరి ప్రకాశం స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రకాశం చూపిన తెగువ జాతీయస్థాయిలో ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపును, కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించి పెట్టిందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర అమోఘమైనదన్నారు. అర్థ శతాబ్ది పాటు తెలుగు వారి రాజకీయాలను ఆయన శాసించారన్నారు. ఆయన జీవితం, వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శప్రాయం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ మంచి పట్టుదల కలిగిన నాయకుడిగా పేరొందారని తెలిపారు. భావితరాలకు ఆయన చిహ్నాలు అందించాలని సూచించారు. ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ అధ్యక్షులు టి.మోహన్ రావు, కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, ఆర్ట్స్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డబ్ల్యూఏజీకే మూర్తి, ఫోరం కార్యదర్శి పీసీ సాయిబాబు, రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు బీవీ రత్న గుప్త, యూవీ రామారావు, రిటైర్డు అధ్యాపకులు శాంతారామ్, బార్ అధ్యక్షుడు అవినాష్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు బందాబాబు, న్యాయవాదులు భానుప్రకాష్, కె.రవిబాబు, సీతారామాంజనేయులు, చలపతిరావు చిత్రకారుడు జీవీ మానం అప్పారావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు గర్నెపూడి వెంకటేశ్వర్లు, ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు కార్డులు త్వరితగతిన ఇవ్వాలి

తహసీల్దారు శ్రీనివాసరావు



భట్టిప్రోలు: కౌలు రైతులకు కౌలు కార్డులు త్వరగా ఇవ్వాలని తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. తహసీల్దారు శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతుల కార్డులు మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని వీఆర్వోలకు సూచించారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ గడువు 23వ తేదీతో ముగిసిందన్నారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పని చేసి అర్హులైన ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డులు ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసుకుని.. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఆయన గోరంట్ల, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, డ్రైనేజీ కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీలో పర్యటించి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైలులో పర్సు మర్చిపోయిన ప్రయాణికుడు

తెనాలిరూరల్: రైలులో విజయవాడలో ఓ ప్రయాణికుడు పర్సు మర్చిపోయాడు. తెనాలి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు రైలులో పర్సును గుర్తించి తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన ఓ కుటుంబం మంగళవారం అర్ధరాత్రి దాటాక నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగింది. కుటుంబంలోని వ్యక్తి పర్సును దిండు కింద పెట్టి మర్చిపోయి దిగిపోయాడు. ఇంతలో రైలు వెళ్లిపోవడంతో తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రికి సమాచారమిచ్చారు. ఎస్ఐ హెడ్‌కానిస్టేబుల్‌కు చెప్పగా రైలులో పర్సు కనబడింది. బుధవారం సదరు ప్రయాణికుడికి తెనాలిలో పర్సు అప్పగించారు.